కరీంనగర్ జిల్లా మానకొండూర్ సర్వసభ్య సమావేశ మందిరం నుంచి జడ్పీటీసీ శేఖర్‌గౌడ్‌ను బలవంతంగా బయటకు తీసుకువెళ్తున్న పోలీసులు

కూర్చుంటే కూర్చో.. లేదంటే గెట్‌లాస్ట్

- వేదికపై తన సీటు ఏదని అడిగిన జడ్పీటీసీపై మానకొండూర్ ఎమ్మెల్యే దురుసు ప్రవర్తన
- ఇది బీఆర్ఎస్ కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వమని హెచ్చరిక
- మానకొండూర్ సర్వసభ్య సమావేశంలో ఘటన
- విద్యుత్తు గురించి వివరిస్తున్న ఏఈకీ మందలింపు
- ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత వచ్చి కలిశారా?
- ప్రతి అధికారి తనను కలవాల్సిందేనని హుకుం

మానకొండూర్, జనవరి 29: మండల సర్వసభ్య సమావేశంలో ప్రొటోకాల్ ప్రకారం ఉండాల్సిన తన సీటు ఏదీ అని అడిగిన జడ్పీటీసీ సభ్యుడిపై మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దురుసుగా ప్రవర్తించారు. 'ఇది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇన్ని రోజులు మీరు డయాస్ మీదనే కూర్చున్నరు. కానీ, ఇప్పుడు కుదరదు. ఇది మీ పాలన కాదు. నీకు ఇష్టం ఉంటే దిగువన కేటాయించిన కుర్చీలో కూర్చో. లేకుంటే వెళ్లిపోవచ్చు. గెట్‌లాస్ట్' అని హెచ్చరించారు. సోమవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల సర్వసభ్య సమావేశంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. ప్రొటోకాల్ ప్రకారం డయాస్‌పై కుర్చీ వేయకపోవడాన్ని జడ్పీటీసీ శేఖర్‌గౌడ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, కవ్వంపల్లి అహంకార పూరితంగా మాట్లాడారు. 'నేను మీతో గొడవపెట్టుకోవడానికి రాలేదు. మీరు ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారి సర్వసభ్య సమావేశానికి వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా వెల్‌కమ్ చెప్పడానికి మాత్రమే వచ్చానని' శేఖర్‌గౌడ్ బదులిచ్చారు. ఎమ్మెల్యే మాటలతో కలత చెందిన శేఖర్.. 'సర్వసభ్య సమావేశానికి వచ్చే అర్హత జడ్పీటీసీకి ఉన్నదా..? లేదా..?' తెలుపాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే పోలీసులను పురామాయించడంతో సీఐ రాజ్‌కుమార్, ఎస్సై శ్రీకాంత్ గౌడ్, సిబ్బంది శేఖర్‌గౌడ్‌ను బలవంతంగా బయటకు తీసుకువెళ్లారు.

హు ఈజ్.. ఫసీ అహ్మద్?

సర్వసభ్య సమావేశంలో మానకొండూర్ విద్యుత్తు సబ్‌స్టేషన్ ఏఈ ఫసీ అహ్మద్ ప్రగతి నివేదిక చదివి వినిపిస్తుండగా, ఎమ్మెల్యే కల్పించుకుని 'హు ఈజ్.. ఫసీ అహ్మద్. ముందుగా ఫసీ అహ్మద్ అంటే ఎవరో నాకు తెలియాలి కదా? నేను ఎమ్మెల్యేగా ఎన్నికై ఇన్ని రోజులవుతున్నా.. మీరు నన్ను కలువలేదు' అని మండిపడ్డారు. వెంటనే అహ్మద్ మాట్లాడుతూ.. 'మీరు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాతనే మా ఉన్నతాధికారులు, రెండు మండలాల ఏఈలతో కలిసి మిమ్మల్ని కలిశాం' అని గుర్తుచేశారు. అయినా తనను ఎవరు కలువలేదని ఎమ్మెల్యే అనడంతో మిగతా అధికారులు కంగుతున్నారు. ఇంతలోనే ఎంపీపీ కల్పించుకుని 'మీ విద్యుత్తు శాఖ అధికారులు కాదు, మండలంలోని వివిధ శాఖల అధికారులందరూ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలవాల్సిందే' అని చెప్పడంతో అందరూ విస్తుపోయారు.

జడ్పీ చైర్మన్‌పై దాడి

మొదటిపేజీ తరువాయి...

రీతిలో వ్యవహరిస్తున్నా అదే వేదికపై ఉన్న జిల్లా కలెక్టర్, డీసీపీ ప్రేక్షక పాత్ర వహించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నది. మంత్రి కోమటిరెడ్డి తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి తర్వాత నంబర్ 2గా తననే గుర్తించాలన్న ధోరణితో వ్యవహరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహారశైలి మరోసారి వివాదాస్పదంగా మారింది.

అసలేం జరిగిందంటే?

సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గూడూరులో నూతన గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం చేశారు. దీనికి ముఖ్య అతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రితోపాటు యాదాద్రి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం అక్కడే సభ నిర్వహించారు. ఈ సభలో ముందుగా ఎమ్మెల్యే, తర్వాత జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి మాట్లాడారు. 'నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నిధులతో నిర్మించిన భవనాలను ప్రారంభించడమే కాకుండా బీఆర్ఎస్‌పై బురద జల్లడం సరికాదు. రైతుబంధు రాలేదన్నోళ్లను చెప్పుతో కొట్టాలని మంత్రి అనడం సబబు కాదు' అని సందీప్‌రెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు. తర్వాత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మైక్ అందుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కేటీఆర్ అహంకారమంటూ 'బచ్చాగాడివి.. రేవంత్‌రెడ్డి కాలిగోటికి కూడా సరిపోవు.. మీ అయ్య అండతో అమెరికా నుంచి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచావ్. మా నాయన ఎమ్మెల్యే కాదు.. రేవంత్ రెడ్డి నాయన ఎమ్మెల్యే కాదు.. కష్టపడి వచ్చాం. ఎమ్మెల్యేలు అయ్యామ'ని తీవ్ర విమర్శలు చేశారు. ఇదే సమయంలో వేదికపై ఉన్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిని ఉద్దేశిస్తూ అహంకారాన్ని ప్రదర్శించబోయారు. 'సందీప్ రెడ్డి కూడా పెద్ద నాయకుడు మాధవరెడ్డి పేరు చెబితే జడ్పీటీసీ అయ్యాడు తప్ప.. సర్పంచ్‌కు కూడా పనికిరాడు' అంటూ ఆయన వైపు చేయి చూపుతూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దీంతో పక్కనే ఉన్న సందీప్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రిగా ఇష్టమొచ్చినట్టు మాట్లాడటం తగదంటూ ఆక్షేపించారు. దీంతో సందీప్‌రెడ్డిని ఏయ్ కూర్చో.. అంటూ ఎదురుగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు రెచ్చగొట్టారు. మంత్రి వెంకట్‌రెడ్డి తీరుపట్ల సందీప్‌రెడ్డి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అయినా మంత్రి అంతటితో ఆగకుండా 'ఈయన్ను బయటకు వెళ్లగొట్టండి' అంటూ పోలీసులను ఆదేశించారు. దీంతో పోలీసు అధికారులు మంత్రికి వత్తాసు పలుకుతూ జడ్పీ చైర్మన్ చెయ్యి పట్టి వేదిక మీది నుంచి నెట్టుకెళ్లే ప్రయత్నం చేశారు. ఆయన పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో వెనక్కి తగ్గగా.. మరోసారి మంత్రి 'బయటకు నెట్టేయండి' అంటూ అరిచారు. ఇదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు మంత్రి అండతో రెచ్చిపోతూ సందీప్‌రెడ్డి వైపునకు దూసుకొచ్చారు. సందీప్ రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నెట్టివేసేందుకు యత్నించారు. ఓ కాంగ్రెస్ కార్యకర్త దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతోపాటు తీవ్ర తోపులాట జరిగింది. బీఆర్ఎస్ శ్రేణులు సంయమనం పాటిస్తూ సందీప్‌రెడ్డికి అండగా నిలిచారు.

గూడూరులో జడ్జీ చైర్మన్ సందీప్‌రెడ్డిని సమావేశం నుంచి బయటకు తీసుకొచ్చిన పోలీసులు

పోలీసుల అత్యుత్సాహం..

అధికారిక కార్యక్రమ వేదికపై జిల్లా కలెక్టర్ కే జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర కూడా ఉన్నారు. జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిని బయటకు నెట్టివేయండని మంత్రి అనగానే స్థానిక పోలీసులు రెచ్చిపోయారు. జడ్పీ చైర్మన్ చేయి పట్టి ఎస్ఐ, సీఐలు నెట్టివేస్తున్నా జిల్లా అధికారులు చూస్తుండి పోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో అత్యున్నత ప్రొటోకాల్ ఉన్న జడ్పీ చైర్మన్‌ను కార్యక్రమానికి ఆహ్వానించి అవమానించేలా వ్యవహరించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మంత్రి ఆదేశాలతో జడ్పీ చైర్మన్‌ను పోలీసులే బయటకు పంపించివేయడం, ఇలా పంపిస్తున్న క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు నెట్టివేయడం, చేయి చేసుకోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. డీసీపీ ముందే స్థానిక పోలీసులు మంత్రి ఆజ్ఞలతో అత్యుత్సాహాన్ని ప్రదర్శించడంపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోమటిరెడ్డీ.. చిల్లర చేష్టలు మానుకో : సందీప్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు రైతుబంధు, రుణమాఫీ, పింఛన్లు, కరెంట్ బిల్లులు చెల్లించాలని అడిగితే, వాటిపై సమాధానం చెప్పకుండా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యక్తిగతంగా ఏదేదో మాట్లాడుతున్నారని జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి మండిపడ్డారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టాలన్న మంత్రి వ్యాఖ్యలు సరికాదని ఆయన దృష్టికి తీసుకొచ్చానని చెప్పారు. మంత్రి హుందాతనంతో ఉండాలని, ఇది సరైన పద్ధతి కాదని సూచించారు. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని, ఇలా చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. ఘటనపై పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

కోమటిరెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి: కేటీఆర్ డిమాండ్

అహంకారంతో అడ్డగోలుగా జడ్పీ చైర్మన్‌పై దుర్భాషలాడిన మంత్రి కోమటిరెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అధికారం లోకి వచ్చిన నాటినుంచి ప్రజలు, ప్రజాప్రతినిధులు అనే తేడా లేకుండా కోమటిరెడ్డి ప్రతి ఒక్కరిపైన నోరు పారేసుకుంటున్నారని మండిపడ్డారు. మొన్నటికి మొన్న రైతుబంధు అడిగితే రైతులను చెప్పుతో కొట్టాలని తన అహంకారాన్ని బయట పెట్టుకున్న కోమటిరెడ్డి, నేడు జిల్లా జడ్పీ చైర్మన్‌పై అదే నోటి దురుసు చూపించారని ధ్వజమెత్తారు. జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి దుర్మార్గంగా వ్యవహరించిన తీరును కేటీఆర్ ఖండించారు. ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాప్రతినిధులకు కూడా గౌరవం లేకుండా నియంతృత్వ ధోరణిలో పని చేస్తున్నదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులపైన కాంగ్రెస్ పార్టీ అరాచకాలను అడ్డుకొని తీరుతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ దురహంకారంతో వ్యవహరిస్తే ఊరుకునేది లేదని, ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

జడ్పీ చైర్మన్‌తో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్

జడ్పీ చైర్మన్‌పై మంత్రి కోమటిరెడ్డి వ్యవహరించిన తీరును తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందీప్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ అంతా సందీప్‌రెడ్డికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీలో ఉన్న కిందిస్థాయి కార్యకర్త నుంచి ఎమ్మెల్యే, ఎంపీ వరకు ఎవరికి ఇబ్బంది ఎదురైనా 60 లక్షల మంది కార్యకర్తల బలగం ఉన్న బీఆర్ఎస్ పార్టీ కుటుంబం భరోసాగా నిలబడుతుందని కేటీఆర్ తెలిపారు. కోమటిరెడ్డి అరాచకపు వ్యవహారంలో గట్టిగా నిలబడి, నిలదీసిన సందీప్‌రెడ్డిని కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ఎంత దుర్మార్గపూరిత వ్యవహారాలకు దిగినా, ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీ అమలు అయ్యేదాకా ఇలాగే కొట్లాడుదామని సందీప్‌రెడ్డితో కేటీఆర్ అన్నారు.

కోమటిరెడ్డిది అధికార మదం: జగదీశ్‌రెడ్డి

'కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికార మదంతో అతి చేస్తున్నాడు. మంత్రి అయిన తర్వాత ఆటవికుడిలా ప్రవర్తిస్తున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో క్యాబినెట్ ర్యాంకులో ఉన్న జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై జరిగిన దాడే అందుకు నిదర్శనం' అని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. సూర్యాపేటలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లుతో కలిసి సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాధవరెడ్డి మంచి నాయకుడే కానీ.. ఆయన కుమారుడు సందీప్‌రెడ్డి ఓ బచ్చా అని కోమటిరెడ్డి అనడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మాధవరెడ్డి పేరు చెప్పుకొని బతికినోడివి. ఆయన వెంట ఉన్న వాళ్లకి సిగరెట్లు తెచ్చి ఇచ్చినోడివి.. అసలు నీ బతుకేందో గుర్తెరగాలి' అని కోమటిరెడ్డిపై మండిపడ్డారు. అంతకుముందు ప్రతిపక్షంలో ఉండి మాట్లాడుతుంటే ఏదో చిల్లరగాడు, చిల్లర మాటలు అనుకున్నాం.. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత హీనస్థాయికి దిగజారి మంత్రి అనే విషయం గుర్తెరగకుండా ఊరకుక్కలా మొరుగుతున్నాడని ధ్వజమెత్తారు. 'అభివృద్ధి నిరోధకుడివి అయిన నీవు.. అనాలోచితంగా, ఇష్టారాజ్యంగా మాట్లాడితే ప్రజల చేత చెప్పుదెబ్బలు తినడం ఖాయం' అని కోమటిరెడ్డిని హెచ్చరించారు. 'క్యాబినెట్ హోదాలో ఉన్న వ్యక్తిని పోలీసు అధికారి ఎలా టచ్ చేస్తారు? దీనిపై డీజీపీ వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలి' అని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. పోలీసులు అత్యుత్సాహం, స్వామి భక్తి ప్రదర్శిస్తే నష్టపోతారని హెచ్చరించారు.

కాంగ్రెస్ నియంతృత్వ పోకడ: హరీశ్‌రావు

యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై అధికారిక కార్యక్రమంలో అకారణంగా దుర్భాషలాడటం కాంగ్రెస్ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఎలిమినేటి సందీప్‌రెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అవమానించడాన్ని ట్విట్టర్ వేదికగా ఖండించారు. కాంగ్రెస్ 'ప్రజాపాలన'లో సాటి ప్రజాప్రతినిధులను అవమానపరుస్తున్న మంత్రుల వైఖరి గర్హనీయమని పేర్కొన్నారు. మొన్న రైతు బంధు రాలేదన్న వారిని చెప్పుతో కొట్టాలని పిలుపునిచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. నేడు ఏకంగా ఓ జడ్పీ చైర్మన్‌ను వేదికపైనుంచి బ యటకు తీసుకెళ్లాలని పోలీసులకు హుకుం జారీ చేయడం దారుణమని మండిపడ్డారు. కోమటిరెడ్డికి ప్రజాస్వామ్యం మీద ఏ మాత్రం నమ్మకం ఉన్నా సందీప్‌రెడ్డికి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

చూస్తూ ఊరుకోం: రావుల

ఎలిమినేటి సందీప్‌రెడ్డిని పోలీసులతో నెట్టివేయించడం సరికాదని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సందీప్ రెడ్డిపై దౌర్జన్యం కాంగ్రెస్ పార్టీ అహంకారానికి నిదర్శనమని, ఓడిపోయిన నేతలు వచ్చి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను అవమానిస్తున్నారని మండిపడ్డారు. మంత్రులు అధికార మదంతో వ్యవహరిస్తున్నారని, ఇకపై తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సందీప్‌రెడ్డిపై దౌర్జన్యానికి పాల్పడిన పోలీసులపై డీజీపీ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారం లంకెబిందెలు వెతకడానికి కాదు

- హామీల అమలుపై దృష్టి పెట్టండి
- దమ్ముంటే ఫాంహౌస్‌ను ముట్టుకుని చూడండి
- కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ హెచ్చరిక

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించింది లంకెబిందెలు వెతకడానికి, ఫాంహౌస్‌ల తవ్వకానికి కాదని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. కేసీఆర్ ఫాంహౌస్‌ను ముట్టుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ఫాంహౌస్‌పై దాడులు చేస్తామన్న కాంగ్రెస్ నేత మధుయాష్కీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఫాంహౌస్ జోలికొస్తే చీల్చిచెండాడతామని హెచ్చరించారు. కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతలు ఇలానే మాట్లాడితే చీల్చిచెండాడతామని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. సీఎం రేవంత్ లంకెబిందెల గురిం చి మాట్లాడడం మాని పాలనపై దృష్టిపెట్టాలని సూచించారు.

జుట్టుపట్టిన కానిస్టేబుల్ సస్పెన్షన్

- ఎట్టకేలకు దిగొచ్చి ప్రభుత్వం చర్యలు
- ఘటనపై 'నమస్తే తెలంగాణ'లో ప్రముఖంగా కథనం

బండ్లగూడ, జనవరి 29: హైకోర్టుకు వ్యవసాయ వర్సిటీ భూముల అప్పగింతపై నిరసన చేపట్టిన ఓ ఏబీవీపీ కార్యకర్తను జుట్టుపట్టి ఈడ్చుకెళ్లిన ఘటనలో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. ఘటనకు బాధ్యురాలైన మహిళాకానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ భూములు హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 55 జారీ చేసింది. ఈ జీవోను వెనక్కి తీసుకోవాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నాయి. ఇందులోభాగంగా ఈ నెల 24న ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అయితే, స్థానిక పోలీసులు విద్యార్థులను చెదరగొట్టారు. ఆ సమయంలో కానిస్టేబుల్ ఆయేషా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని హోండా యాక్టివాపై వెంబడిస్తూ జుట్టు పట్టి ఈడ్చుకెళ్లారు. దీంతో ఆ యువతి కింద పడి తీవ్ర గాయాలపాలై దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఈ ఘటనపై 'నమస్తే తెలంగాణ'లో వార్త ప్రముఖంగా ప్రచురితమైంది. అనేక సోషల్ మీడియాల్లో వీడియో వైరల్ అయ్యింది. స్పందించిన సీపీ.. విచారణ చేపట్టి కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకొన్నారు. అటు.. జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) కూడా స్పందించింది. మీడియా కథనాలను సుమోటోగా స్వీకరించి.. ఘటనపై వివరణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. యువతి ఆరోగ్య పరిస్థితి సహా పూర్తి వివరాలతో నాలుగు వారాల్లోగా నివేదిక అందించాలని సీఎస్, డీజీపీకి నోటీసులు ఇచ్చింది.

..అదానీ, అంబానీలకు ధారాదత్తం

మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్ సాగనివ్వదనీ తేల్చిచెప్పారు. రాముడిపై రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు. అన్ని వర్గాలు, అన్ని మతాల కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

హైదరాబాద్‌లో స్వేచ్ఛగా, స్వతంత్రంగా బతవచ్చనే నమ్మకాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అభివృద్ధి చేసిన హైదరాబాద్‌లోని విలువైన భూములను బీఆర్ఎస్ పాలకులు కొల్లగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటేస్తే, బీఆర్ఎస్ ఢిల్లీకి వెళ్లి బీజేపీ తెచ్చిన చట్టాలకు మద్దతుగా పార్లమెంట్‌లో ఓటేసిందని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టేనని స్పష్టం చేశారు. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు, నల్లధనం వెలికితీస్తామని చెప్పిన బీజేపీ గత పదేండ్లలో చేసినదేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు భట్టి పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ ఖాతాలో నర్సాపూర్ బల్దియా

- మున్సిపల్ చైర్మన్‌గా దుర్గప్పగారి అశోక్‌గౌడ్ ఎన్నిక
- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల శుభాకాంక్షలు

నర్సాపూర్, జనవరి 29: మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ పదవిని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకున్నది. గతంలో బీఆర్ఎస్ నుంచి చైర్మన్‌గా ఎన్నికైన మురళీయాదవ్ బీజేపీ తీర్థం పుచ్చుకుని పదవికి రాజీనామా చేయకుండా.. చైర్మన్‌గా చెలామణి అయ్యారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆయనపై అవిశ్వాసం పెట్టాలని అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అవిశ్వాసానికి ముందస్తుగానే మురళీయాదవ్ పదవికి రాజీనామా చేశారు. దీంతో మున్సిపల్ చైర్మన్ పదవికి ఎన్నిక అనివార్యమయింది. సోమవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించగా.. మొత్తం 15 మంది కౌన్సిలర్లలో 9 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు వెంకట్రామ్‌రెడ్డి, యాదవరెడ్డి హాజరయ్యారు. ఆరుగురు బీజేపీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్‌గా దుర్గప్పగారి అశోక్‌గౌడ్‌ను కౌన్సిలర్ రాంచందర్ ప్రతిపాదించగా మరో కౌన్సిలర్ తంగెడుపల్లి సరితా ఆమోదించారు. దీంతో మిగతా కౌన్సిలర్లు మద్దతు ప్రకటించగా దుర్గప్పగారి అశోక్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అశోక్‌గౌడ్‌కు మున్సిపల్ చైర్మన్‌గా నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు అశోక్‌గౌడ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటగోపాల్, పట్టణ ప్రణాళిక అధికారి భూపతి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కృష్ణయ్య, మేనేజర్ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ ఎన్నికను నిర్వహిస్తున్న తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి. హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, కౌన్సిలర్లు

పోలీసులపై రోహింగ్యాల దాడి

- రాయల్ కాలనీ డైమండ్ హోటల్ దగ్గర ఉద్రిక్తత
- బర్మా దేశస్థుడి మృతదేహంతో రోహింగ్యాల ఆందోళన
- పోలీసులపై రాళ్లు రువ్వడంతో కానిస్టేబుల్‌కు గాయాలు
- షరీఫ్‌నగర్‌లోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు

బడంగ్‌పేట, జనవరి 29: బర్మా దేశస్థుడి హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రోహింగ్యాలు సోమవారం మృతదేహంతో యూఎన్‌హెచ్‌ఆర్‌సీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని భీష్మించారు. దీంతో రాయల్ కాలనీ డైమండ్ హోటల్ వద్ద ఉద్రిక్త తనెలకొన్నది. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఇబ్రహీం అనే వ్యక్తిని ఇద్దరు వ్యక్తులు కత్తులతో దాడి చేసి చంపేశారు. బర్మా దేశానికి చెందిన ఇబ్రహీం బంధువులు, స్నేహితులు మృతదేహంతో నేరుగా రాయల్‌కాలనీలోని యూఎన్‌హెచ్‌ఆర్‌సీ కార్యాలయానికి చేరుకొని ఆందోళనకు దిగారు. వెంటనే అక్కడికి చేరుకున్న బాలాపూర్ సీఐ వెంకట్‌రెడ్డి ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పోలీసులు మాట్లాడుతుండగానే రోహింగ్యాలు పోలీసులపై రాళ్లు విసిరారు. శ్రీశైలం అనే హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉండటంతో అదనపు బలగాలను రంగంలోకి దింపారు. ఆందోళనకారులను చెదరగొట్టిన పోలీసులు మృతదేహాన్ని షరీఫ్‌నగర్‌లోని శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేయించారు. పోలీసులపై దాడికి పాల్పడిన వారిని సీసీ పుటేజీల ఆధారంగా గుర్తించి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు.